క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 25 వేల విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు మిక్కిలినేని శ్రీనివాస్, శివాని దంపతులు రూ. 25,002 విరాళంగా అందజేశారు. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

కృత్తివెన్ను: రైతులు తాము సాగుచేస్తున్న పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి ఎస్. జెన్నీ అన్నారు. మండలంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ క్రాప్ నమోదు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు వివరాలను రైతు భరోసా కేంద్రం వద్ద వీఏఏకి తెలియజేస్తే వారు పంట ప్రదేశానికి వచ్చి ఈ క్రాప్ నమోదు చేస్తారని చెప్పారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే



మచిలీపట్నంటౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ డే ను మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్కారుతోటలోని కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పర్ణం సతీష్, వైఎస్సార్ సీపీ 4వ డివిజన్ ఇన్‌చార్జి రాఘవ, న్యాయవాది ఎల్. బాలాజీ, సంఘ అధ్యక్షుడు సీహెచ్ శేషు, కోశాధికారి శ్రీరాం, గౌరవాధ్యక్షుడు కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ర్యాలీ



మచిలీపట్నంటౌన్: ప్రపంచ మానవత్వ దినోత్సవం సందర్భంగా పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థినులు శనివారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి పరాసుపేట వరకు ర్యాలీ జరిగింది. మానవత్వం వర్ధిల్లాలంటూ విద్యార్థినులు నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ తలశిల దామోదర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తోటి వారితో ప్రేమ, సేవాభావంతో మెలగాలని చెప్పారు. మానవత్వ సంస్థ అధ్యక్షుడు సాయికృష్ణప్రసాద్, చైర్మన్ ఉల్లి రంగారావు, రిటైర్డ్ ఎంఈఓ కె. రాజేంద్రప్రసాద్, న్యాయవాది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి

ఫిషరీస్ జేడీ శ్రీనివాసరావు

మచిలీపట్నంటౌన్: మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డాక్టర్ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులుగా మహిళలకు నిర్వహించిన మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. శిక్షణ పొందిన 29 మంది మహిళలకు శ్రీనివాసరావు ధ్రువీకరణ పత్రాలను అందజేసి మాట్లాడారు. పట్టాభి సంస్థ డైరెక్టర్ విజయభారతి మాట్లాడుతూ రానున్న రోజుల్లో యువకులకు ఏసీ మెకానిజం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కార్ డ్రైవింగ్, మహిళలకు కంప్యూటర్ అకౌంటింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 80089 96818 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ ఇన్‌చార్జీల నియామకం



మేకల సుబ్బన్న



కాగిత బున్ని

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జీలుగా నియమిస్తూ తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మచిలీపట్నం నగర పరిధిలో క్లస్టర్ ఇన్‌చార్జీలుగా మేకల వెంకట సుధాకర్ బాబు (సుబ్బన్న), కాగిత జవహర్‌లాల్ నెహ్రూ (బున్ని) లను నియమించారు. వీరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

రహదారులకు హరిత హారం

- జూన్ 17న ప్రారంభమైన జగనన్న పచ్చ తోరణం
- నాటి నుంచి నిరంతరాయంగా సాగుతున్న కార్యక్రమం
- వేలాది మొక్కలు నాటుతున్న స్వచ్ఛ చల్లపల్లి బృందం



జూన్ 17న మొక్క నాటి జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి (ఫైల్)

చల్లపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన జగనన్న పచ్చ తోరణం కార్యక్రమం చల్లపల్లిలో విస్తృతంగా సాగుతోంది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు జూన్ 17న జాతీయ రహదారి 216కు ఇరువైపులా చల్లపల్లి వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి రోజూ నిరంతరాయంగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్-డాక్టర్ టి.పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు ప్రతి రోజూ తెల్లవారు ఝామున నాలుగు గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు.

12 కిలోమీటర్లు లక్ష్యం..

చల్లపల్లి పరిధిలోని రహదారులకు ఇరువైపులా 12 కిలోమీటర్ల మేర మొక్కలు నాటే లక్ష్యంతో స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు శ్రమిస్తున్నారు. చల్లపల్లి పరిధిలోని జాతీయ రహదారి-216కు ఇరువైపులా ఆరు కిలోమీటర్లు, నడకుదురు రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్లు, చల్లపల్లి-పెద్దకళ్లేపల్లి రోడ్డుకు ఇరువైపులా నాలుగు కిలోమీటర్లు మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే లక్ష్యానికి మించి చల్లపల్లి-రామానగరం పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు.



హైవే పక్కన మొక్కలు నాటుతున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు (ఫైల్)

పలు రకాల మొక్కలు..

గ్రామీణ రహదారులకు ఇరువైపులా నేరేడు, బాదం, వేప, వెలగ, గానుగ, ఎర్ర తురాయి, పచ్చ తురాయి, పెద్ద ఉసిరి, చిన్న ఉసిరి, మామిడి మూడు రకాలు. సీతాఫలం, నాటు జామ, గన్నేరు, సపోటా మొక్కలు నాటుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా హైవే అధికారుల సూచన మేరకు సువర్ణ గన్నేరు, ఎంపోరియం, పారిజాతం, గుడి గన్నేరు, టికోమా రెడ్, పచ్చ గన్నేరు, కరివేరా (గన్నేరు), గద్దగోరు (అడవి తంగేడు), నూరు వరహాలు, మద్రాసు కనకాంబరం, టెంపుల్ ట్రీ, వృక్ష జాతి మద్ది, బాదం, కదంబం మొక్కలు నాటారు. ఇప్పటి వరకు 1500 మొక్కలు నాటిన స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు మరో 500లకు పైగా మొక్కలు నాటే పనిలో నిమగ్నమయ్యారు. రహదారులపై ఆహ్లాదకరమైన చల్లని, పచ్చని వాతావరణం ఏర్పరిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోంది. దాతలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. వెంకటాపురం రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమానికి కోనేరు మారుతీ ప్రసాద్ ఆర్థిక సహకారం అందించి అన్ని ఫల, వృక్ష, పూల జాతి మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా ఈ మహాయజ్ఞంలో తన వంతు భాగస్వామ్యం వహించారు.

తొమ్మిదేళ్లలో 25 వేల మొక్కలు



స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం చేపట్టిన నాటి నుంచి తొమ్మిదేళ్లలో చల్లపల్లి పరిసర గ్రామాల రహదారులకు ఇరువైపులా సుమారు 25 వేల మొక్కలు నాటాము. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో ప్రతి కార్యకర్త తెల్లవారు ఝామునే లేచి స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణకు శ్రమదానం చేస్తున్నారు. తాజాగా చేపట్టిన పచ్చ తోరణం కార్యక్రమంలో రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి కొనసాగిస్తున్నాము.

– డాక్టర్ డీఆర్కే ప్రసాద్, కన్వీనర్

పచ్చదనమే ధ్యేయం



చల్లపల్లి పరిధిలోని అన్ని ప్రధాన రహదారులు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలనే ఆలోచనతో డాక్టర్ డీఆర్కే ప్రసాద్- డాక్టర్ టి.పద్మావతి దంపతులు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం కొనసాగిస్తున్నారు. తాజాగా చల్లపల్లి పరిధిలో అందుబాటులోకి వచ్చిన జాతీయ రహదారి-216కు ఇరువైపులా వాహన చోదకులకు చల్లని, పచ్చని వాతావరణం ఏర్పరిచేందుకు విస్తృతంగా మొక్కలు నాటుతున్నాము.

– మెండు శ్రీనివాసరావు, స్వచ్ఛ కార్యకర్త

ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పులిగడ్డ(అవనిగడ్డ): ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పులిగడ్డలో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయి పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. రూ.10.65 లక్షల జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టనున్న ఇంటింటికీ కుళాయి పనులకు ఎమ్మెల్యే సింహాద్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ కుళాయి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. విద్య, వైద్యం, ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దాసి హాజిబాబు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొంగంచర్ల, బంటుమిల్లిల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం

పెడన: పెడన మండలం కొంగంచర్ల సర్పంచ్ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు లోయ ఊహ 22 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సమీప టీడీపీ మద్దతుదారు పుట్టి శ్యామలకు 203 ఓట్లు రాగా, ఊహకు 225 ఓట్లు లభించాయి. 469 ఓట్లకు గాను 436 ఓట్లు పోలయ్యాయి. 8 ఓట్లు చెల్లలేదు. బంటుమిల్లి మండలం బంటుమిల్లి పంచాయతీ 4వ వార్డు సభ్యురాలిగా వైఎస్సార్ సీపీ మద్దతుదారు గొల్ల సృజన 111 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడ మొత్తం ఓట్లు 342 కాగా 307 పోలయ్యాయి. సృజనకు 207, మంజులకు 96 ఓట్లు రాగా 4 ఓట్లు చెల్లలేదు. గూడూరు మండలం పోలవరం పంచాయతీ వార్డు సభ్యురాలిగా వీరంకి నాగమణి, పెడన మండలం కాకర్లమూడి పంచాయతీ వార్డు సభ్యురాలిగా గడిశె లక్ష్మీతిరుపతమ్మ గెలుపొందారు. వీరిని టీడీపీ బలపరిచింది. పెడనలో జరిగిన కొంగంచర్ల ఉప ఎన్నికల పోలింగ్‌ను జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ నాగేశ్వరనాయక్, డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎంపీడీఓ రెడ్డయ్యలు పర్యవేక్షించారు. పెడన, కృత్తివెన్ను ఎస్‌ఐలు రవిచంద్రకుమార్, గణేష్‌కుమార్ పర్యవేక్షణలో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.



కొంగంచర్ల సర్పంచ్‌గా ఎన్నికైన లోయ ఊహ దంపతులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బంటుమిల్లి పంచాయతీ వార్డు సభ్యురాలిగా ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సృజన

వైఎస్సార్ సీపీ సంబరాలు..

వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలిచిన కొంగంచర్ల సర్పంచ్ లోయ ఊహ దంపతులను అభిమానులు, పార్టీ నాయకులు నాగబాబు, అచ్యుతరావు, రామానాయుడు, భైరవలింగం తదితరులు సన్మానించారు. స్థానికులతో కలిసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. విజేత ఊహను నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అభినందించారు.

టీడీపీ అంచనాలు తారుమారు

బంటుమిల్లి: బంటుమిల్లి గ్రామ పంచాయతీ నాలుగో వార్డుకు శనివారం జరిగిన ఎన్నికల ఫలితం టీడీపీ నాయకుల అంచనాలను తారుమారు చేసింది. వార్డు సభ్యురాలు గొల్ల నిర్మల అకాల మృతితో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మృతురాలు నిర్మల కోడలు సృజనను అభ్యర్థిగా ఎంపిక చేశారు. మృతురాలు నిర్మల కుటుంబానికి చెందిన వ్యక్తికే సీటు కేటాయించడంతో సానుభూతితో తొలుత పోటీ ఉండదని అందరూ భావించారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు బేతపూడి మంజులను పోటీలో నిలిపారు. పంచాయతీలో 14 మంది వార్డు సభ్యులున్నారు. గత పాలకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఏడుగురు, టీడీపీకి ఏడుగురు సభ్యులు ఉన్నారు. సర్పంచ్ ఓటుతో ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఒక అభ్యర్థి మృతితో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో విజయం సాధిస్తే ఉప సర్పంచ్ పదవిని దక్కించుకోవచ్చని భావించి టీడీపీ అభ్యర్థిని పోటీలో నిలిపి భారీస్థాయిలో ఖర్చుచేశారు. ఎన్నిక ఉత్కంఠ భరితంగా జరగడంతో గెలుపుపై, మెజారిటీపై బెట్టింగ్‌లు కూడా జరిగాయి. టీడీపీ నాయకులు, స్థానికులు, పందెంరాయుళ్ల అంచనాలను తలకిందులు చేస్తూ సృజన 111 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించింది. సృజనకు మద్దతు ఇచ్చి గెలుపు కోసం సర్పంచ్ కృష్ణవేణి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అంకితభావంతో పనిచేశారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

బంటుమిల్లి: గ్యాస్ వినియోగదారులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పెడన మండలం నడుపూరు గ్రామానికి చెందిన మీనాక్షి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వారు తెలిపారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెదతుమ్మిడి గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంట్లో గ్యాస్ వాడకం సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, గ్యాస్ ఆదా విధానం, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

చల్లపల్లి: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాల్య వివాహ నిషేధ చట్టం -2006పై ప్రచారం ప్రారంభించారు. పంచాయతీ, గ్రామ సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, రద్దీ ప్రదేశాల్లో అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కలతోటి సుధాకర్, వేముల శ్రీను, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో రెండు గేదెలు మృతి

కోనేరుసెంటర్: రెండుచోట్ల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సేకరించిన వివరాల ప్రకారం బందరు నుంచి విజయవాడ వెళుతున్న కారు మూడు స్తంభాల సెంటర్ ఫ్లై ఓవర్ సమీపంలో ఓ గేదెను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. అదే సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న మరో కారు రోడ్డుకు మరో వైపు వేరే గేదెను ఢీ కొంది. ఈ ప్రమాదంలోనూ గేదె మృతి చెందింది. విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న ఓ వ్యక్తి కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉత్తర చిరువోలులంక (మోపిదేవి): ప్రాథమిక స్థాయిలోనే విద్యకు బలమైన పునాది వేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ విద్యాసాగర్ అన్నారు. ఉత్తర చిరువోలులంక ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఇరువురు ఉపాధ్యాయులను సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు ఉపాధ్యాయులు కుమార్, జ్యోతి మాట్లాడుతూ 2017లో అప్పటి దాత, ఇప్పటి సర్పంచ్ శ్రీనివాసరావు సహకారం విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. దాత సేవలను కొనియాడారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్. ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్. రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: వాసవీ విద్యార్థి సహాయ నిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు వైబ్రేషన్ సుజోక్, అయస్కాంత చికిత్స శిబిరం నిర్వహిస్తామని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రారంభిస్తారన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ఆవరణలో శిబిరం జరుగుతుందన్నారు.

అదృశ్యమైన హాస్టల్ విద్యార్థుల ఆచూకీ లభ్యం

కోనేరుసెంటర్: హాస్టల్ విద్యార్థులు ఐదుగురు అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై బందరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బందరు మండలం బైరాగిపాలెంలోని బెరాకా హోంలో చదువుకుంటున్న ఐదు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఐదుగురు ఈ నెల 17వ తేదీన హాస్టల్ నుంచి బయటికి వెళ్లారు. అప్పటి నుంచి వీరు కనిపించకుండా పోయారు. విద్యార్థుల కోసం ఎంత గాలించినా ప్రయోజనం లేకపోవడంతో హాస్టల్ వార్డెన్ వేముల బుచ్చేశ్వరరావు శనివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు ప్రారంభించారు. అదృశ్యమైన ఐదుగురు అవనిగడ్డలో ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ సత్యనారాయణ, ఆర్‌పేట ఎస్‌ఐ వాసు అవనిగడ్డకు వెళ్లి విద్యార్థులను మచిలీపట్నం తీసుకువస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

విద్యుత్ ఈఈ భాస్కరరావుకు సన్మానం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం డివిజన్ విద్యుత్ ఈఈ మన్నెం భాస్కరరావును పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక పుట్లమ్మ చెరువు ఈఈ కార్యాలయంలో దళిత, బహుజన ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈఈ భాస్కరరావుకు సంఘ నాయకులు నూతన వస్త్రాలను అందజేసి సన్మానించారు. ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు ప్రభుత్వపరంగా అందాల్సిన పలు బెనిఫిట్స్ సత్వరమే అందేలా ఈఈ భాస్కరరావు కృషి చేస్తున్నారని చెప్పారు. ఉద్యోగ సంఘ నాయకులు సాయిబాబు, రాంబాబు, సామేరు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

గూడూరు: వైఎస్సార్ సీపీ గూడూరు మండల కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహిస్తామని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గూడూరు సమీపంలోని సుమ కన్వెన్షన్‌లో నిర్వహించే సమావేశానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పాగ, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కృత్తివెన్ను: పొగ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పల్లెపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణి అన్నారు. పాఠశాలల పరిసరాలలో పొగతాగడం నిషేధమని చెప్పారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పొగతాగడం, మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పొగాకు వాడకం నిషిద్ధమని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణి, ఉపాధ్యాయులు కె. సూర్యప్రకాష్, రాజ్యలక్ష్మి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదలను ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మూడో డివిజన్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర సమయంలో పేదల కష్టాలను దగ్గర నుంచి చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ కష్టాలను పరిష్కరించే దిశగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దీంతో పేదల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. పేదల ఆర్థిక బాధలను కొంత వరకు తీర్చారని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



స్థానికురాలి సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందించాలి

బందరు డీఎస్పీ మాధవరెడ్డి

మచిలీపట్నంటౌన్: విద్యార్థుల్లో సేవాగుణం, సమాజం పట్ల బాధ్యతను మరింత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బందరు డీఎస్పీ మాధవరెడ్డి అన్నారు. స్టార్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత పెంచేందుకుగానూ సేకరించిన లక్ష రూపాయలను వివిధ స్వచ్ఛంద సంస్థలకు శనివారం డీఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువే కాకుండా ఇతరులను ఆదుకునే గుణాన్ని, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించే తత్వాన్ని నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్టార్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. స్టార్ విద్యాసంస్థల ఫౌండర్ పేర్నేటి శ్రీరామ్, డైరెక్టర్ బొమ్మిడి అయ్యప్పస్వామి సేకరించిన లక్ష రూపాయలను రెడ్‌క్రాస్ సొసైటీ, మైత్రి ఫౌండేషన్, తులసీ హెల్పింగ్ హ్యాండ్స్, హెల్పింగ్ స్పాట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులకు రూ. 25 వేలు చొప్పున ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సేకరించిన మొత్తానికి సంబంధించిన చెక్కును డీఎస్పీ మాధవరెడ్డికి అందజేస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: మండల పరిధి పల్లెపాలెం గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సమక్షంలో విజయవాడలో వైఎస్సార్ సీపీలో చేరారు. మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, పల్లెపాలెం సర్పంచ్ కె. రాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పెదశింగు ఏడుకొండలు, మోకా వెంకటేశ్వరరావు, పెదశింగు దానయ్య, మోకా రామస్వామి, మోకా శ్రీనివాసరావుతోపాటు పలువురికి మంత్రి జోగి రమేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు అండగా ఉంటారని చెప్పారు.